శ్రీ అరవిందోపన్యాసము

ప్రకాశకులగు

చతుర్వేదుల వేంకటకృష్ణయ్యగారిపేర

గ్రంథముయొక్క సర్వ హక్కులు

రిజిష్టరు చేయబడినవి.

౧౯౩౭

0-75

వెల రూ. ~~౧-౧౨-౦~~.   పోస్టేజి వేఱు.

శ్రీ అరవిందులు, నిర్దోషియని తీర్పు చెప్పబడి, కారాగారమునుండి విడుదల గాంచిన తరువాత, ౧౯౦౯ మే నెల ౩౦ తేదిన ఉత్తరపరలో నొసంగిన ఆంగ్లోపన్యాసమున కిది యాంధ్రీకరణము.

శ్రీ అరవిందాశ్రమం,
పుదుచ్చేరి,
౧౫—౧౧—౩౮.

ఇట్లు,
చ. వే. కృష్ణయ్య.

రెండవ కూర్పు

శ్రీ అరవిందోపన్యాసము

మీ సభావార్షిక సమావేశమున నన్నుపన్యసింపుడని మీరు కోరినపుడు, ఈనా డనుకొనిన విషయమును గుఱించి, అనగా హిందూ మతమును గుఱించి, కొన్ని మాటలు దెలుప సంకల్పించియుంటిని. కాని నే నిపుడా యుద్దేశమును నెరవేర్తునో లేదో నాకు తెలియదు; ఏలనన, నే నిచ్చట గూర్చుండగనే మీకు నే దెలుపవలసిన యొక సందేశము, హైందవజాతి కంతకును నేను దెలుపవలసిన యొక సందేశము నా మనస్సున బ్రవేశించినది. కారాగారములో మొదట నాకే యాసందేశము తెలుపబడినది, నా దేశీయులకు దానిని తెలుపుటకై నేను కారాగారమునుండి బయటకు వచ్చితిని.

లోగడ నే నిచ్చటికివచ్చి సంవత్సరముపైగా నైనది. నే వచ్చినపుడు నే నొంటరిగా నుండలేదు; జాతీయ ప్రవక్తలం దత్యంత సమర్థులైనవారిలో నొకరు నా ప్రక్క నాసీనులై యుండిరి. తాను తెలుపవలసిన సందేశమును, ఆతని కారాగారపు విజనమున నిశ్శబ్దమున, విననగునట్లు భగవానుడే పంపియుండిన ఏకాంతవాసమునుండి వెడలివచ్చిన దాయనయే.

ఆయననే మీరు గుంపులుగుంపులుగా వచ్చి యాహ్వానించియుండినది. ఇపుడాయన మనలనుండి వేలకొలది మైళ్ళుగా విడివడి ఎంతో దూరమున నున్నాడు. నాకు బరిచయమై నావెంట బనిచేయుచుండిన ఇతరులును బరోక్షమున నున్నారు. దేశమంతయు నూడ్చిపెట్టిన ఝంఝామారుతము వారినందఱను దూరదూరముగా చెల్లాచెదరుచేసినది. ఈ పర్యాయ మేకాంతవాసమున సంవత్సరముపాటు గడిపినది నేను ; నేనిపుడు బయటకు రాగా నంతయు తారుమారైనట్లు కనపడుచున్నది. నిరంతరము నా ప్రక్కగూర్చొని నా కార్యమందు బాల్గొనుచుండినవాడు బర్మాలో బందీయై యున్నాడు, మఱియొక రుత్తరదేశమున నిర్బంధమున మ్రగ్గచున్నాడు. నేను విడుదలయై వచ్చినపుడు చుట్టుపట్ల నవలోకించితిని ; ఆలోచనా ప్రోత్సాహముల నిమిత్తమెవరిని బ్రతీక్షించుట నా కభ్యాసమైయుండెనో వారికొఱకై నలుదిక్కుల వీక్షించితిని. కాని వారు నాకగపడలేదు. ఇంతియగాదు, నేను జెయిలుకు వెళ్ళినపుడు పతితావస్థనుండి యపుడపుడే మేల్కొనుచుండిన లక్షలాది మానవుల సంపూర్ణ విశ్వాసముతో జాతియొక్క ధైర్యోత్సాహములతో, వందేమాతరం ధ్వనులతో

దేశమంతయు నుత్సాహభరితమై యుండెను. జెయిలు నుండి నేను వెలుపలికి వచ్చినపు డాధ్వనికై చెవియొగ్గితిని, కాని యా ధ్వనికి మారుగా నిశ్శబ్దమేయుండెను. ఒక నిశ్శబ్దము దేశము నావరించి వేసెను. ప్రజలు విభ్రాంతులైనట్లు గనుపడిరి; ఏలనన మనముందు భావి శుభ దర్శనారూపముతో నిండియుండిన భగవానుని స్వచ్ఛాకాశమునకు బదులు మానవసంబంధమైన మిఱుములు నుఱుములు వర్షించెడి మలినాకాశము నెత్తిపై బడునట్లు కనబడెను. ఏదారి త్రొక్కవలసినది యెవరికిని తెలిసినట్లులేదు, "ఇక మనమేమి చేయుదుము? మనము చేయగల దేమున్నది?" అను ప్రశ్నయే యన్నిదిక్కులనుండి వచ్చినది. ఏదారిని బోవుటకునాకు గూడ తెలియకుండెను. ముందేమిచేయవలసినది నేను గూడ నెఱుంగకుంటిని. కాని యొకవిషయము నాకు తెలియును—ఎట్లాభగవానుని సర్వ సమర్థమైనశక్తి ఆ ధ్వనిని ఆ విశ్వాసమును లేవదీసెనో యట్లాశక్తియే ఈ నిశ్శబ్దమును బంపించినదని; ఆ కోలాహలమం దా యుద్యమ మందుండిన ఆ భగవానుడే ఈ నీరవతయందు నిశ్శబ్దమునందు నున్నాడని. ఈ జాతి క్షణకాలము వెనుదిరిగి, యంతర్ముఖమై యాతని ఇచ్ఛ నెఱుంగుట కను

వగునట్లు ఆయనయే దీనిని మనపై బంపెను. ఆ నిశ్శబ్దము వలన నేను నిరుత్సాహమందుట లేదు. ఏలనన నా కారాగారమందు నిశ్శబ్దమున కలవాటుపడిపోతిని; మఱియు దీర్ఘవత్సర పర్యంతమైన నా నిర్బంధావాసమున నేను నేర్చుకొనిన పాఠ మీ నీరవత నిశ్శబ్దములందే యని నాకు తెలియును. విపినచంద్రపాలుడు జెయిలునుండి విడుదలయైవచ్చినపు డతడొక యాదేశమును గైకొనివచ్చెను. అది యొక యనుప్రేరితమైన సందేశము. ఇచ్చట నాత డొసంగిన యుపన్యాసము నాకు జ్ఞాపకమున్నది. దాని సారాంశోద్దేశ్యములబట్టి యది రాచకీయ సంబంధముకంటె మతసంబంధము మిక్కుటముగాగల యుపన్యాసము. జెయిలులో తన యనుభూతిని గుఱించి, మన యందఱిలోనున్న దైవమును గుఱించి, జాతిలోపలనున్న పరమేశ్వరుని గుఱించి ఆయన ఉపన్యసించియుండెను. వెంటవెంట నాత డపుడిచ్చిన ఉపన్యాసములందుగూడ నుద్యమమందున్నశక్తి సాధారణశక్తికంటె మహత్తరమని, ఆ యుద్యమోన్ముఖమున నున్నకార్యము మామూలు కార్యముకంటె మహత్తరమని తెలిపియుండెను. ఇపుడు నేనుగూడ మరల మిమ్ము కలిసికొంటిని, నేనుగూడ జెయిలు

నుండి బయటకువచ్చితిని; మఱియు నుత్తరపరవాసులగు మీరే—రాజకీయ సమావేశమునగాక మన మతరక్షణమునకైన సంఘసమావేశమున—తిరిగి నన్నాహ్వానించుటకు మొదటివారు. బక్సారుజెయిలులో విపిన చంద్రపాలుడు స్వీకరించినట్టి సందేశమును ఆలిపూరు జెయిలులో భగవానుడు నాకొసంగెను. నా పండ్రెండు మాసముల కారాగారస్థితియందనుదినమును నా కా సందేశమును జ్ఞానమును భగవానుడనుగ్రహించెను. మఱియు నేను బయటకువచ్చినతరువాత ఆ సందేశము నే మీకిపుడు తెలుప నన్ను భగవానుడాజ్ఞాపించియున్నాడు.

విడుదల లగుదునని నాకు తెలియును, నిర్బంధవాసమైన ఆ సంవత్సరము కేవల మేకాంతవాసమునకు సాధనకు నైన సంవత్సరముగానే యుద్దేశింపబడినది. భగవానుని యుద్దేశ్యమున కవసరమైయుండినదానికన్న నెక్కువగా జెయిలులో నన్నెవరుంచిపట్టగలరు? మాటాడుట కొక సందేశము, చేయుట కొక కార్యము నాకాయన ఒసంగియుండెను—ఆసందేశము వెల్లడింపబడువఱకు నే మానవశక్తియు నన్నణచిపెట్టజాలదని, ఆ కార్యమొనర్పబడువఱకు భగవానుని యుపకరణమును — అది ఎంత దుర్బలమైనదైనను సరియే, ఎంత స్వల్పమైనదైనను

సరియే — ఏమానవశక్తియు నిరోధించజాలదని నాకు తెలియును. నే నిపుడు బయటకువచ్చితిని, ఈ కొద్ది నిముసములలోఁగూడ, నాకు ప్రసంగింప నిష్టములేకుండిన యొక సందేశము నాకు సూచింపబడినది. నామనస్సులో నుండినదాని నిపుడే ఆయన త్రోసివేసినాడు, ఇక నేను మాటాడునది యొక ప్రేరణమీఁదనే, నిర్బంధముమీఁదనే.

నన్ను పోలీసువారు పట్టుకొని లాల్‌బజారు పోలీసు స్టేషన్‌కు త్వరితముగా వెడలించినపుడు ఒక్కక్షణము పరమేశ్వరునిపట్ల నా విశ్వాసము చలించినది. ఏలనన వానిసంకల్పము నవలోకింపజాలక పోతిని. కావున నే క్షణ కాలము సంకోచించితిని. “సర్వేశ్వరా! నాకు సంభవించిన దిదియేమి? నా దేశీయులకై నేనొనర్చవలసిన కార్యమొకటి యున్నదని, అది పరిపూర్తియొనర్పబడువఱకు తమచే సంరక్షితుడనై యుందునని విశ్వసించితినే! అట్టిచో నిట్టినేరారోపణపై నేనిచట నెందులకున్నాను?” అని భగవంతునిగూర్చి నా హృదయమందు మొరలిడితిని. ఆవల నొకటి, రెండు, మూడు దినములుగూడ గడచెను. అపుడు నా హృదయమునుండి “వేచియుండుము, వీక్షింపుము” అని యొకవాణి వినవచ్చినది. నేనంత ప్రశాంతుడనై ప్రతీక్షించితిని. లాల్‌బజారునుండి

ఆలిపూరుకు గొంపోబడితిని. మనుజులనుండి దూరీకృతు డనై యొకమాస మేకాంత కారాగారబంధమున నుంప బడితిని. అచ్చట నాయందంతస్థితమైన ఆభగవానుని దివ్యవాణి నాకర్షించుటకై, ఆ భగవాను డాజ్ఞాపించున దేదియో అవగాహన మొనర్చుకొనుటకై, నే నొనర్ప వలసిన దేదియో నేర్చుకొనుటకై అహర్నిశలు నిరీక్షించి తిని. ఆ యేకాంతమునందే ప్రప్రథమసాక్షాత్కారము, ప్రథమపాఠము నా కనుగ్రహింపబడినది. అప్పుడునన్ను బట్టుకొనుట కించుమించు నెలదినములకు ముందుగా నే నెఱింగిన యొకవిశేషము నాకు జ్ఞప్తికి వచ్చినది. ఆ విషయ మేమన, భగవంతునితోడి యధికాధికసంబంధ భాగ్యము నాకుగలుగుట కనువుగా నేకాంతవాసమునకు నే నేగుటకు, ఆత్మయం దంతర్దృష్టిచే సమీక్షించు కొనుటకు, నా కర్మకలాపము నంతను గట్టిపెట్టుటకును అంతర్వాణిరూపమున నా కొక యాదేశము వచ్చి యుండెను. కాని బలహీనుడనుగానుండి యా యా దేశమును శిరసావహించజాలక పోతిని. నాకృషి నాకపు డత్యంత ప్రియమై యుండెను. నే నచ్చట లేకున్న ఆ కార్యము హానిబొంది తుదకు నష్టమై నిలిచిపోవునని నా హృదయాంతరమునగల అహంకార కారణమున నేను

భావించితిని. అందువలన నే నాకార్యమును విడిచిపెట్ట కుంటిని. భగవానుడు మరల నాతో నీరీతి సంభాషించినట్లు నా కనుభూతమాయెను. "నీవే త్రెంపివేసికొనజాలని బంధముల నీకుగా నేనే త్రెంపివైచితిని. ఏలనన, ఆకార్య మట్లు కొనసాగవలయునను ఇచ్ఛ నాకు లేదు. ఎన్నడు నా కట్టి సంకల్పముగూడ లేదు. నీవు చేయవలసినది మరొక కార్యముకలదు. ఆ కార్యార్థము—నీయంతట నీవు నేర్చుకొనజాలకుండిన దానిని నీకుబోధించుటకు, నాకార్యమునకు నిన్ను తయారు చేయుటకు—నిన్ను నే నిచ్చటికి తీసికొనివచ్చితిని." అంత భగవానుడు గీతాగ్రంథమును నా హస్తములందుంచెను. అతనిశక్తి నాలో బ్రవేశించెను. నేను గీతాప్రోక్తసాధనము చేయగలిగితిని. శ్రీకృష్ణు డర్జునునకేమి యాచరింపుమని యాజ్ఞాపించెనో, తనకార్యమొనర్ప గాంక్షించువారి కందఱకు నేమి శాసించునో—అనగా రాగద్వేషములనుండి విముక్తి నందుటకు, ప్రతిఫలాపేక్షలేక భగవత్ ప్రీతికై కార్యమొనర్చుటకు, పరమేశ్వరునిహస్తమున స్వీయచేష్టా రహితమైనట్టియు విశ్వాసవంతమైనట్టియు నొక యుపకరణముగా నగుటకు, అల్పుడు-అధికుడు, మిత్రుడు-శత్రుడు,

జయము-అపజయము, వీనిపట్ల సమహృదయము గలిగియుండుటకు, ఇట్లుండియు నీశ్వర కార్యముల నజాగ్రత్తగా జేయకుండుటకును—దానిని నేను బుద్ధిబలముతో గ్రహించుటకుమాత్రమేగాక అనుభవమునకు దెచ్చుకొనవలసి యుండెను. హిందూమత మనగా నేమో నాకవగాహన మైనది. మనము హిందూమతమునుగురించి సనాతనధర్మమునుగురించి పలుమారు ప్రసంగింతుమేగాని మనలో నిజముగా కొలదిమందియే దానినిగురించి యెఱుంగుదురు. ఇతర మతములు మతవిశ్వాస సంప్రదాయములే ప్రధానముగా గలిగియున్నవి. కాని సనాతన ధర్మము జీవితసర్వస్వమునై యున్నది; అది నిత్యానుష్ఠాన మందుండవలసినదేగాని అంతగా విశ్వాసముపై నాధారపడియుండునదికాదు. విశ్వమానవ విమోచనముకయ్యే ఈ ద్వీపమునం దేకాంతముగా బహుకాలమునుండి వర్ధిలజేయబడుచున్న ధర్మము. ఈ సనాతన మతము నందఱకు బ్రసాదించుటకే భారతదేశము వర్ధిల్లుచున్నది. ఇతరదేశములవలె స్వార్థమునకుగాని, లేదా తాను శక్తివంతమైనపుడు దుర్బలుల నణగద్రొక్కుటకుగాని ఇండియా వర్ధిల్లుటలేదు. ఆమె తన కప్పగింపబడిన ఆ నిత్యజ్యోతిని ప్రపంచమునందంతట బ్రచు

రించుటకే వర్ధిల్లుచున్నది. తనకొఱకుగాక మానవకోటి కొఱకే ఇండియా ఎల్లపుడు నిలిచియున్నది. తనకొఱకు గాక మానవకోటికొఱకే ఆమె మహాత్వమును బడసి యుండవలయును.

కావున తదుపరి భగవానుడు నాకు జూపించిన దిది: హిందూమతముయొక్క మూలసత్యమును నేను గుర్తించునట్లొనర్చెను. నాపైని జెయిలర్ల హృదయమును మార్చి వారిని నాపట్ల సుముఖులుగా జేసెను. "ఇత డేకాంతనిర్బంధమున బాధపడుచున్నాడు. ఉదయమున సాయంకాలమున అర్ధఘంట సేపాతనిగది కావల తిరుగుటకైన సెలవిండు" అని జెయిలర్లు ఆంగ్లేయుడగు కారాగృహాధికారితో మాటాడిరి. ఆప్రకారమేర్పాటయినది. అపుడు నేనట్లు నడచుచున్న సమయము నందే తిరిగి ఆతని—భగవానుని—శక్తి నాలో ప్రవేశించినది. నన్ను మనుజులనుండి ప్రత్యేకించిన ఆ కారాగృహము నొకపర్యాయ మవలోకించితిని. నేను బంధింప బడియున్నది ఆ యున్నతకుడ్యముల కారాగారముగా గనబడలేదు. అంతేకాదు! నన్ను వాసుదేవుడే పరివేష్టించియుండెను. నాగదిముందలి వృక్షశాఖల క్రింద నడచితిని. కాని యది వృక్షముకాదు!

అటనిలిచి తన యూచ్ఛాదనము నాపై బఱచి రక్షించినది శ్రీకృష్ణుడే, వాసుదేవుడే! నా కారాగారపు గది యొక్క-కమ్ములను—తలుపునకు ప్రత్యామ్నాయముగా నున్న ఇనుపకమ్ములను—వీక్షించితిని. తిరిగి ఆ వాసుదేవుడే కంటికగపడెను. పహారాఇచ్చుచు నాపై గావలి కాయుచుండినది నారాయణుడే! పరుండుటకు నా కియ్యబడిన మోటుకంబళ్లపై మేనువాల్చితిని. అప్పుడును శ్రీకృష్ణుని - నా ప్రాణమిత్రుని - ప్రియుని - దివ్యకరస్పర్శనము ననుభవించితిని. నాకాతడు అనుగ్రహించిన నిగూఢసందర్శన ప్రథమప్రయోజన మిదియే. బందిఖానాలో నున్న ఖైదీలు, దొంగలు, ఘాతకులు, వంచకులు వీరిపట్ల వీక్షించితిని. వారిని జూడగనే వాసుదేవుడు ప్రత్యక్షమాయెను. ఈ తమోావృతాత్ములందు దుర్వినియోజిత దేహములందును నారాయణుడే నాకు ప్రసన్న మాయెను. ఈ దోపుడుగాండ్రలో, దొంగలలో ననేకులు తమ అనుతాపముచేతను దయచేతను నన్ను సిగ్గుపడునట్లు చేసిరి. అట్టి ప్రతికూల పరిస్థితులందుకూడ వారియందు మానవత్వమే విజయముగాంచినది. నేను వారిలో ముఖ్యముగా నొకరిని జూచితిని. నా కాయన పావనపురుషుడుగా గనబడెను.

ఆతడు చదువను వ్రాయను ఎఱుంగని నాజాతి రైతు బిడ్డ, దోపిడి నేరారోపణమున పదేండ్ల కఠినశిక్షకు బాల్పడినాడు; మన బాహ్యాచారజనిత జాత్యహంకారమున నీచజాతిగా తిరస్కరింపబడినవాడు. మరొక మారు భగవానుడు నాతో నిట్లు మాటాడెను. "ఎవరిమధ్య నాకార్యము నొకించుక సాగించుటకు నిన్ను నేను బంపితినో ఆ మానవులను జూడుము. నే నుద్ధరించుచున్న జాతిస్వభావ మిదియే. నే నుద్ధరించుటకు కారణ మిది."

క్రిందికోర్టులో కేసు విచారణ ప్రారంభమై మేజస్ట్రీటు ఎదుట మేము గొనిరాబడినపుడును న న్నా యంతరదృష్టియే వెంబడించెను. భగవాను డిట్లనెను. "నీవు జెయిలులో త్రోయబడినపుడు భగ్న హృదయుడవై 'తమ ప్రాపేడ' యని నాకై ఆక్రందించలేదా? ఇదిగో! ఇపుడు మేజస్ట్రీటును చూడుము. నేరారోపణ మొనర్చు ప్రభుత్వ న్యాయ వాదిని జూడుము". నేను కన్నెత్తి జూచితిని. నా కగుపడినది మేజస్ట్రీటుకాదు, వాసుదేవుడే, ఆ న్యాయ స్థానమున గూర్చొనియుండినది నారాయణుడే. అంత ప్రభుత్వపక్ష న్యాయవాది దెస చూచితిని. నా కగు

పడినది ప్రభుత్వపక్ష న్యాయవాది గాదు. అట గూర్చొనియుండినది శ్రీకృష్ణుడే! ఆ నా ప్రియుడు-మిత్రుడే-అచ్చట గూర్చొని మందహాస మొనర్చి యిట్లనెను. "ఇపు డింకను భయమొందుదువా? నే నెల్ల మానవులయందు నంతర్యామిని. పరివర్తనములను నేను శాసించెదను. ఇంకను నారక్షణ నీకు గలదు. నీవు భయపడరాదు. నీపై కొనిరాబడిన ఈ అభియోగమును నాచేతి కప్పగింపుము. దానితో నీ కవసరము లేదు. విచారణనిమిత్తముగాదు నిన్నిచ్చటికి గొనివచ్చినది; మఱొకపనికి. ఈ యభియోగము నా కార్యమున కొక సాధనమేకాని, అంతకంటె మరేమియు గాదు." ఆవల సెషన్సుకోర్టులో విచారణ ప్రారంభమైనపుడు, నా న్యాయవాదికి, నా ప్రతిపక్ష సాక్ష్యమున నేది యసత్యమో, సాక్షుల నే యే విషయములపై సవాలుచేయనగునో వాటివిషయమై, నా సలహాలనన్నింటిని వ్రాయనారంభించితిని. అపుడు నే నూహించని దొకటి సంప్రాప్తమైనది. నాపక్షమున వాదించుట కేర్పరుపబడిన ప్రయత్నము లన్నియు నకస్మాత్తుగా మారి పోయినవి. నాపక్షమున వాదించుటకై మరియొక న్యాయవాది న్యాయస్థానమున నిలువబడెను. అనుకొన

నిదేవారు వచ్చిరి. వారు నాస్నేహితులు. కాని ఆయన వచ్చుచున్నాడను విషయమే నాకు తెలియదు. నన్ను రక్షించుటకై ఎవరు తన తక్కిన ఆలోచనల నన్నింటిని త్రోసిపుచ్చి, తన న్యాయవాది వరుంబడినంతను పరిత్యజించి, మాసములపర్యంతము దినదిన మర్ధరాత్రి వఱకు మేలుకొనియుండి దేహారోగ్యమును గోల్పోయెనో ఆపురుషుని నామమును—శ్రీయుత చిత్తరంజనదాసుగారిని—మీరందఱు వినియున్నారు. వారిని నేను చూడగానే తృప్తిపడితిని. అట్లయ్యును సంజాయిషీ వ్రాసి యిచ్చుట అవసరమని అపుడుగూడ భావించితిని. అంతనదియంతయు మారిపోయినది. అంతఃస్థితముగా నాకీ సందేశము లభించినది. "నీకాళ్ల చుట్టు నొడ్డిన ఉరుల నుండి నిన్ను రక్షించునదీయనయే. ఆ కాగితముల నావల బెట్టుము. ఆతనికి సలహా చెప్పునది నీవుకాదు. నేనాయనకు బోధించెదను". అప్పటినుండి కేసునుగుఱించి యొక్కమాటనేని నాయంతట నేను నా న్యాయవాదితో ననియుండలేదు. అథవా నేనెపుడేని ప్రశ్నింపబడునపుడు ఆప్రశ్నకొసంగు నా సమాధానము కేసునకేమాత్రము సహాయకారిగానట్లు నాకెల్లప్పుడు కనబడుచుండెను. అంత సర్వము నాతనికే వదలివేసితిని. అతడే

సంపూర్ణముగా నావ్యవహారము నంతను దనచేతిలోనికి తీసికొనెను. ఎట్టి పర్యవసానము గాంచెనో మీకు తెలియును. నాకొఱకు దైవ మేమి యుద్దేశించెనో మొదటి నుండియు నాకు తెలియును. కారణము పదింబది నాకది వినబడినది. అంతర్వాణి కెల్లపుడు వీనులొగ్గి నేనిట్లు వినుచుంటిని. "నేను నడిపించుచున్నాను. కాన భయ పడవలదు. కారాగారమున కెందులకు నిన్ను తీసికొని వచ్చితినో ఆకార్యముపట్ల నే నీదృష్టిని మరల్పుము. నీవు బయటికి వచ్చినపు డెన్నడును భయపడరాదని సంశ యింపరాదని జ్ఞాపకముంచుకొనుము. ఇదంతయు జేయు చున్నది నేనే ననియు, నీవుగాని మరెవరుగాని కారనియు జ్ఞాపకముంచుకొనుము. కావున నెట్టి మబ్బులేని ఎట్టి యపాయము లేని ఎట్టిబాధలేని ఎట్టికష్టము లేనిరానిమ్ము, ఎంత అసాధ్యమేని గానిమ్ము; ఏదియు నసాధ్యముగాదు. ఏదియు కష్టముగాదు. జాతియందు, జాతీయాభ్యుదయ మందు నేనున్నాను. నేను వాసుదేవుడను, నారాయ ణుడను. నే నేమి యిచ్ఛగింతునో అదియే అయితీరును గాని ఇతరులు గోరునది కానేరదు. దేనిని నేను సంఘ టింపజేయ నభిలషించితినో దానిని ఏ మానవశక్తియు నివారించజాలదు."

ఇంతలో నాభగవానుడు నన్నేకాంతవాసము నుండి వెలుపలికి గొనివచ్చి నాతోబాటు నేరారోపణ మొనరింపబడిన వారితో జేర్చెను. నా స్వార్థత్యాగమును గురించి నా దేశభక్తినిగురించి యీ నాడెంతో మీరు ప్రశంసించియునారు. నేను చెఱసాలనుండి బయల్వెడలి వచ్చినది మొదలిట్టి ప్రశంసాసంభాషణములనే వినుచుంటిని, కాని ఎంతో సంకటపడుచు, బాధాకరముగా దానిని వినుచుందును. ఏలనన, నా దౌర్బల్యము నే నెఱుంగుదును. నా స్వకీయ దోషములకు వెనుకంజలకు నేను బలియగుచున్నాను. మునుపుగూడ నాలోపములను గుర్తించకపోలేదు. కాని యవియన్నియు నాయేకాంతవాసమున నాపై విజృంభించినపుడు నన్నెంతో క్రుంగదీసినవి. అపుడు మానవుడ నగు నేను వట్టి బలహీనపు ముద్దనని, దోషభూయిష్ఠము లోపభూయిష్ఠము నగు నుపకరణము నని, ఒక యుత్కృష్ట శక్తి నాలో ప్రవేశించినపుడు మాత్రమే నేను శక్తిమంతుడ ననియు గ్రహించితిని. అంతట నే నాయువకుల మధ్య నుండగా వారిలో బహుళసంఖ్యాకులకడ మహత్తమ సాహసధైర్యమును స్వార్థత్యాగ శక్తియును గుర్తించితిని. వానితో బోల్చిచూచిన నే నెందుకును బనికిరాను.

అందులో నొకరిద్దరు శక్తిశీలములందేగాక—అట్టివారు పలువురు గలరు-ఏవిషయమున నేను గర్వపడుచుంటినో అట్టి బుద్ధివైభవమునగూడ నాకంటె సమర్థులగువారిని కనుగొంటిని. అపుడు నా కా భగవానుడాదేశించిన దిది: "నా యాజ్ఞానుసారము వర్ధిలుచున్న నవీనము బలవత్తరమునగు జాతి, యువకసంతతి, ఇదిగో? వారు నీకంటె గొప్పవారే. భయపడుట కేమున్నది? నీవు వైదొలగినను నిద్రావశుడ వైనను నా యాకార్య మప్పటికిని సాగుచుండును. నీవు రేపు వైదొలగి పోయినయెడల నిదిగో ఈ యువకులు గలరు, ఆ కార్యమునకు బూనుదురు. నీ వే నాడును జేయనంతటి యధికసామర్థ్యముతో వారు చేయుదురు. ఈ జాతి కొక సందేశము నిచ్చుటకు నీవు నావలన గొంతశక్తిని సముపార్జించితివి. ఆసందేశ మీజాతి వర్ధిల్లుటకు సాయపడును."

పిమ్మట నకస్మాత్తుగా నొకటి సంభవిల్లెను. నే నొక త్రుటిలో నేకాంతకారాగార మందే కాంతముగా నుండుటకు గొంపోబడితిని. ఆకాలమందు నాకేమి సంప్రాప్తమైనదియు వెల్లడించుటకు సంప్రేరితుడనుగాను. కాని యనుదినము భగవానుడు తన యద్భుతముల జూపించెననియు హిందూమతముయొక్క పరిపూర్ణ

సత్యము నా కాత్మానుభవమగునట్లు చేసెననియు మాత్రము చెప్పగలను. నాకంతకు పూర్వ మెన్నియో సంశయము లుండెను. నే నింగ్లాండునందు విజాతీయ భావములలో కేవలము విదేశ వాతావరణమున బెరిగితిని. హిందూమత మంతయు భావనాకల్పితమనియు నందు స్వాప్నిక సంబంధ మెక్కువగా నున్నదనియు భ్రాంతి మాయ ఈ సంబంధమే మిక్కుటమనియు నిట్లు హిందూమతమందలి అనేక విషయముల గురించి పూర్వ మొకప్పుడు భావించు చిత్తవృత్తి నందియుంటిని. కాని యిప్పు డన్ననో హిందూమత సత్యముల ననుదినము మానసమున గ్రహించితిని, హృదయమున సాక్షాత్కరించుకొంటిని, శరీరమం దనుభవించితిని. అవి నాజీవనమునందు సిద్ధానుభవము లయినవి. ఏభౌతిక శాస్త్రము విప్పి చెప్పలేని విషయములు నాకు దృగ్గోచరము లయినవి. భగవానుని నేను ప్రప్రథమమున సమీపించినపుడు పూర్తిగా భక్తున కుండవలసిన భావమునగాని జ్ఞాని కుండవలసిన లక్షణమునగాని నే నుండలేదు. నేను ప్రజాహిత కార్యరంగమున కీడ్వబడకమున్ను, స్వదేశోద్యమమునకు ముందు, కొన్ని సంవత్సరముల క్రిందట బరోడాలో నే నాతని సమీపించితిని.

నేను దైవము చెంతజేరిన యప్పటి యీ కాలమున ఆచరణనిరతమగు శ్రద్ధ నాకాయనయందు లేకుండెను. దైవము మన కందరాని దనుభావము, నాస్తికభావము, సంశయభావము నాకుండెను. అసలు దైవ మొకడున్నా డనునదియే నేను గట్టిగా నమ్మకుంటిని. ఆతని సాన్నిధ్యమును నే నెఱుంగకుంటిని. ఇట్లుండియు న దేదో యొకటి వేదసత్యమునకు, గీతాప్రోక్త సత్యమునకు హిందూమత సత్యమునకు నన్నాకర్షించి వైచినది. ఈ యోగమం దెచ్చటనో యొక ప్రబల సత్యము, వేదాంతముపై నాధారపడిన ఈ హిందూమతమునం దొక గట్టిసత్యము ఉండి తీరవలయునని యనిపించినది. కావున నేను యోగాభిముఖుడనై దాని నభ్యసించుటకు, నాయీభావము సరియేనా యని కనుగొనుటకు తీర్మానించుకొనినపుడు నే నీభావముతో భగవానునిట్లు ప్రార్థించితిని: "సర్వేశ్వరా! నీవు ఉన్న యెడల నిక నా హృదయము నెఱుంగుదువు. ముక్తికొఱకు తమ్ము నే నర్థించుటలేదని, ఇతరులందరు నడుగు నట్టిదానిని దేనిని నేను గోరుటలేదని తమకు తెలియును. ఈ జాతి నుద్ధరించుటకు శక్తిని మాత్రమే నేను వేడుచున్నాను. ఎవరికొఱకు నాజీవితము ధారపోయునట్లు ప్రార్థించెదనో,

ఎవరిని నేను ప్రేమించెదనో అట్టి యీమానవులకు సేవ జేయుటకు, వారికిగా జీవించుటకు నన్ననుగ్రహించు డని మాత్రమే తమ్మభ్యర్థింతును." యోగసిద్ధికై బహు కాలము శ్రమపడితిని. తుదకు కొంతవఱ కుపలబ్ధి గాంచితిని ; కాని ఎందుల కత్యంతముగా కాంక్షించితినో ఆ విషయమున తృప్తినందలేదు. ఆవల కారాగారము యొక్క ఏకాంతవాసమున నా ఏకాంతపు గదియందు మరలదానికై ప్రార్థించి యిట్లంటిని ; "తమ యాదేశమును బ్రసాదింపుము. ఏమి చేయవలయునో దానినెట్లు చేయవలయునో నాకు దెలియదు. సందేశము ననుగ్రహింపుము." ఆవల యోగసంధానమున రెండు సందేశము లనుగ్రహింపబడినవి. మొదటి సందేశమిది: "నేనొక కార్యమును నీ కిచ్చియున్నాను, అది యీజాత్యుద్ధరణమునకు సాయపడుటయే. త్వరలోనే నీ వీ కారాగారమునుండి స్వేచ్ఛ గాంచు కాలము రాగలదు. ఏలనన, నీ వీ పర్యాయము శిక్షింపబడుటగాని లేక దేశమునకుగా నితరులవలె బాధపడుచు నీవు కాలము గడత్రోయవలయుననిగాని నా సంకల్పముగాదు. పనిచేయుటకు నిన్ను నే నియమించితిని, నీవు ప్రార్థేయపడిన ఆదేశము నదియే. ఇక బయటకువెళ్లి నాకార్యమొనర్చు

టకు నీ కా దేశము నిచ్చుచున్నాను.'' రెండవ సందేశము నందుకొంటిని. అది యిది: ''ఏకాంతవాసమగు నీ సంవత్సరమునందు నీ కేవిషయమున సందియము లుండెనో ఆ విషయమును గుఱించి నీకు ప్రత్యక్షము గావింపబడియున్నది, హిందూమత సత్యమదియే. ప్రపంచమునెదుట నేను లేవదీయుచున్న దీ మతమునే. నేను ఋషులు సాధుసత్తములు, అవతారమూర్తులు వీరి మూలమున నభివృద్ధిగావించి పరిపూర్ణస్థితి నందించిన దీ మతమునే; ఆ మతమే నానాజాతులలో నాకార్యమొనర్చుటకు ప్రస్తుతము ప్రారంభించుచున్నది. నాసందేశమును వ్యాపింపజేయుటకే నేనీ జాతిని సముద్ధరించుచున్నాను. ఇదియే సనాతనధర్మము, సనాతనమతము. నిజముగా నీ వింతకుముందు దీని నెఱుంగకుంటివి; కాని దానిని నీ కిపుడు నేను వ్యక్తమొనర్చియున్నాను. నిన్నంటియుండిన అవిశ్వాసమునకు, సంశయమునకు సమాధాన మియ్యబడినది. బహిరంతరములందు స్థూలసూక్ష్మరూపమున నీకు తార్కాణముల నిచ్చియున్నాను, నిన్నవి సంతృప్తుని గావించినవి. నీ విక బయటికి వెళ్ళునపు డీసందేశమును నీ జాతికిచాటింపుము. సనాతనధర్మమునకయ్యే వా రభ్యుదయము గాంచ

వలెను. వారి యభ్యుదయము కేవలము వారికొఱకు గాక ప్రపంచమునకే. సర్వప్రపంచ సంసేవనమునకై వారికి స్వాతంత్ర్యప్రదాన మొనర్చుచున్నాను. అందు వలన భారతదేశ మభ్యున్నతి నందినదన సనాతనధర్మమే సముద్ధృత మగునని భావము. భారతదేశము ప్రశస్తమై విస్తరించుననిన సనాతనధర్మమే ప్రపంచము నందంతటను బ్రశస్తమై వ్యాప్తి గాంచుననిభావము. ఈధర్మముకొఱకే, ఈ ధర్మాధారముననే భారతదేశము జీవించియున్నది. మతమును మహిమాన్విత మొనర్చుటయనిన దేశమును మహిమాన్విత మొనర్చుటయే. సర్వప్రదేశములందు సర్వమానవులందు సర్వవస్తువులయందు నే నున్నా ననియు, నే నీ యుద్యమమునం దున్నాననియు, దేశమున కుగా కష్టపడువారియందు మాత్రమేగాక ఆ దేశసేవకుల నెదిరించి వారిమార్గము నిరోధించు వారియందును నేను పనిచేయుచున్నాననియు నీకు నిరూపించియున్నాను. ప్రతిదేహమందును నేను బనిచేయుచున్నాను. మానవులు వారియిష్టము వచ్చినట్లు ఏమి యాలోచించినను ఏమి చేసినను నా సంకల్పమునకు సాయపడుటకన్న నన్యమేమియు చేయజాలరు. వారుగూడ నా కార్యమునే జేయుచున్నారు; వారు నా యుపకరణములేగాని నా

శత్రువులుగారు. మీ సర్వవ్యాపారములందును ఏ మార్గ మున మీరు నడుచుచున్నదియు తెలియకనే మీరు ముందు కేగుచున్నారు. మీ రొకకార్య మొనర్ప నూహించి మరియొకటి చేయుదురు. మీ రొకఫలమును కాంక్షించ మీ ప్రయత్నములు మాత్రము తదితరము నకో తద్విరుద్ధమగుదానికో ఉపయోగ పడుచున్నవి. ఒకశక్తి బయలుదేరి ప్రజలలో ప్రవేశించినది. బహు కాలముగా నే నీ యభ్యుదయమును సంసిద్ధ మొనర్చు చున్నాను. ఇపుడు కాల మాసన్నమైనది. ఇక నేనే దానిసిద్ధిని ప్రాప్తించెదను.

నేనిక మీకు తెలుపవలసిన దిదియే. మీసంఘ ము పేరు ''మతరక్షకసంఘము'', మంచిది. మతరక్ష ణము, ప్రపంచమునందు హిందూమత రక్షణము, హిందూమతాభ్యుదయము నిదియే మన భావికార్యము. కాని అసలు హిందూమతమనగా నేది? సనాతనము, శాశ్వతము నని మనము వ్యవహరించు ఈ మత మెట్టిది? హిందూజాతి దానిని నిలుపుకొనియున్నది కాబట్టి, ఆ సేతు హిమాచల మం దేకాంతముగా నీ ద్వీపమునందే వృద్ధిబొందినది కాబట్టి, ఈ పవిత్రము పురాతనము నగు నీ దేశమందలి ఆర్యజాతికి యుగయుగములుగా దీనిని

భద్రపఱచు భారమప్పగింపబడినది కాబట్టి ఇది పేరునకు హిందూ మతమైనది. కాని యేదోయొక దేశము యొక్క సరిహద్దులలో నది కుదింపబడలేదు. విశేషముగా శాశ్వతముగా ప్రపంచముయొక్క యేదోయొక పరిమితమైన భూభాగమునకీమతము సంబంధించదు. మనము హిందూమతమని పిలుచునది యదార్థముగా సనాతనమతము. ఏలనన, అది ఇతర అన్నిమతముల సమాలింగన మొనర్చుకొను విశాల విశ్వ మతమై యున్నది. మతము విశాలవిశ్వ సంబంధము గానియెడల నది సనాతనము గాజాలదు. సంకుచితమైన మతము, ఏదోయొక తెగకు సంప్రదాయమునకు సంబంధించిన మతము, దేనితో సంబంధములేని ప్రత్యేకమతము స్వల్పకాలము మాత్రమే స్వల్పప్రయోజనార్థమే జీవించగలదు. ఈమత మొక్కటియే, భౌతికశాస్త్ర పరిశోధనలను తత్త్వజ్ఞానచింతనలను ముందుగా నూహించి యిమిడ్చుకొని యున్నందున, జడవాదమును ఓడించగలదు. భగవానునకు మనుజులమగు మనకుగల సన్నిహిత సంబంధమును మానవకోటిపై గట్టిగా నొక్కి చెప్పినది ఈ మత మొక్కటియే, మానవుడు భగవానుని సమీపించగల సకలసాధనలను తన దృష్టిపథ

మున సమాలింగన మొనర్చిన దీ మత మొక్కటియే. అఖిలేశ్వరుడఖిలమానవులందును అఖిలవస్తువులందును ఉన్నాడని ఆయన లోపలనే మనముండి సంచరించుచున్నామని అన్నిమతము లంగీకరించునటువంటి సత్యముమీాద ననుక్షణము పట్టువిడనాడకుండునది యీా మత మొక్కటియే. ఈ సత్యమును గ్రహించి విశ్వసించుట మాత్రమే గాక మనయొక్క ప్రతి అంశమందును దానిని సాక్షాత్కరించుకొనుటకు సాయపడుచున్న దీమత మొక్కటియే. ఈ విశ్వమేమిగా నున్నది—అనగా నది వాసుదేవుని లీలావిలాసమని—ప్రపంచమునకు చాటుచున్నది ఈ మత మొక్కటియే. ఆ భగవల్లీలయందు, సూక్ష్మతమమైన ఆ ధర్మములందు, మహత్తమమైన ఆ నియమములందు పాత్రలమైన మనయొక్క కర్తవ్యమును సంపూర్ణముగా శ్రేష్ఠముగా నెట్లు నిర్వహింపగలమో వెల్లడించుచున్న దీమత మొక్కటియే. ఎంతటి సూక్ష్మాతిసూక్ష్మ విషయములందును జీవన ప్రవృత్తిని మతమునుండి విడదీయనట్టియు అమృతత్వ మన నేమో గ్రహించినట్టియు మృత్యువుయొక్క సత్యమును నిశ్చయముగా మననుండి దూరీకృత మొనర్చినట్టియు మత మిది యొక్కటియే.

ఈ నాడు మీకు దెలుపవలసినదిగా నావాక్కునందు ప్రసాదింపబడిన సందేశ మిదియే. నే నేమి మాట్లాడుట కూహించితినో అది నానుండి దూరీకృతము గావింపబడినది. నాకేది ప్రసాదింపబడినదో దానికంటె నెక్కువ నేజెప్పుట కేమియును లేదు. ఆసందేశ మిపుడు పూర్తియైనది. మునుపొక పర్యాయము మీ శక్తితోడనే ఉపన్యసించి యుంటిని. అపుడీ యుద్యమము రాచకీయోద్యమము కాదనియు, జాతీయత రాచకీయముగాక యొకమతము, ధర్మము, విశ్వాసమే యనియు నేను చెప్పియుంటిని. మరల దానినే యీనాడు తెలుపుచున్నాను. ఇక జాతీయత మతమని, ధర్మమని, విశ్వాసమని నేనెన్నడును తెలుపను. అది సనాతనధర్మమని చెప్పెదను. సనాతనధర్మమే మనజాతీయత. ఈ హిందూజాతి సనాతనధర్మములో నుద్భవించినది. దానితో పెరిగి దానితో వృద్ధియగుచున్నది. సనాతనధర్మము క్షీణించినా ఆజాతికూడ—హిందూజాతికూడ—క్షీణించును. సనాతనధర్మము నశించగలిగినా హిందూజాతియు నశించగలదు. సనాతనధర్మమే జాతీయత. నేను మీ కందజేయవలసియుండినది ఈ సందేశమే.

శ్రీ అరవిందాశ్రమ ముద్రణాలయమున ముద్రితము, పుదుచ్చేరి.

శ్రీ అరవింద గ్రంథములు

*౧	శ్రీ అరవిందవ్యాసావళి ౨-వ కూర్పు	౧	౮	౦
౨	శ్రీ అరవిందలేఖలు	౦	౬	౦
౩	శ్రీ అరవిందోపన్యాసము	౦	౬	౦
*౪	శ్రీ అరవిందజీవితము ౩-వ కూర్పు	౩	౦	౦
*౫	శ్రీ మాతృవాక్కులు ౨-వ కూర్పు	౩	౦	౦
౬	మాతవచనములు	౦	౪	౦
౭	యోగదీపికలు	౦	౧౦	౦
౮	యోగదర్శిని	౦	౧౦	౦
౯	తత్త్వప్రభ	౦	౪	౦
౧౦	పరమావిష్కారము	౦	౪	౦

విరివిగా కొనెడి వ్యాపారస్తులకు కమీషన్ లభించును.

ప్యాకింగు పోస్టేజి ఖర్చులు వేఱు.

చిరునామా :

చతుర్వేదుల వేంకటకృష్ణయ్య,
శ్రీ అరవిందాశ్రమం,
పుదుచ్చేరి.

*త్వరలో వెలువడును.